క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్



కంభం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కె.వి.పద్మావతి 'దళిత స్త్రీ వాద సాహిత్యం పరిశీలన' అనే అంశం పై ద్రవిడియన్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. డాక్టర్ కాకాని సుధాకర్ పర్యవేక్షణలో ద్రవిడియన్ విశ్వ విద్యాలయం కుప్పం వారికి సిద్ధాంత గ్రంథం సమర్పించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలికి అభినందనలు తెలిపారు.

మార్కాపురం డీఎస్పీగా నాగరాజు



డీఎస్పీ నాగరాజుతో సీఐలు, ఎస్సైలు

మార్కాపురం: మార్కాపురం డీఎస్పీగా యు.నాగరాజు సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో లా అండ్ ఆర్డర్ విషయంలో రాజీ పడేది లేదని, సత్వర న్యాయం అందిస్తామన్నారు. సీఐ సుబ్బారావు, ఎస్సైలు సైదుబాబు, అంకమరావు తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

తర్లుపాడు ఎస్సైగా బ్రహ్మనాయుడు



తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడు ఎస్సైగా గత వారం బాధ్యతలు చేపట్టిన టి.రాజ్‌కుమార్ మళ్లీ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న బ్రహ్మనాయుడుకు పోస్టింగ్ ఇచ్చారు. గత నెలలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై వేముల సుధాకర్ కొత్తపట్నం బదిలీ అయ్యారు. సుమారు రెండు వారాల అనంతరం గుంటూరు జిల్లా పెదనందిపాడులో పనిచేస్తూ రాజ్‌కుమార్ బదిలీపై తర్లుపాడు వచ్చారు. సోమవారం జరిగిన బదిలీ ళక్షళ తర్లుపాడుకు బ్రహ్మనాయుడు, కొనకనమిట్లకు రాజ్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కొమరోలు ఎస్సైగా వెంకటేశ్వర నాయక్



నూతన ఎస్సై వెంకటేశ్వరనాయక్

కొమరోలు: పోలీసుస్టేషన్ నూతన ఎస్సైగా వెంకటేశ్వర నాయక్‌ను నియమిస్తూ ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న వెంకటేశ్వర నాయక్‌ను కొమరోలు పోలీసు స్టేషన్‌కు బదిలీ చేయగా ప్రస్తుతం కొమరోలు పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై మధుసూదన్‌రావును వెలిగండ్ల పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న వీరు వెంటనే బదిలీ అయిన పోలీసుస్టేషన్‌లో బాధ్యతలు చేపట్టాలని ఎస్పీ దామోదర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

50 మద్యం బాటిళ్లు స్వాధీనం



క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్సై కోటేశ్వరరావు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామంలో అక్రమంగా మద్యం క్వార్టర్ బాటిళ్లను తరలించి గుట్టు చప్పుడు కాకుండా అమ్మకాలు చేస్తున్న బొజ్జా భాస్కర్ అనే వ్యక్తిని ఎస్సై పి.కోటేశ్వరరావు రాచర్లఫాం వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని దగ్గర అమ్మకానికి సిద్ధంగా ఉన్న 50 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇసుక కొరతపై ధర్నా రేపు

పొదిలి: ఇసుక కొరత సమస్య తీవ్రతను తెలిపేందుకు ఈ నెల 18వ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఇసుక పాలసీని సమీక్షించి ఉచితంగా సరఫరా చేస్తామన్న కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని రమేష్ విమర్శించారు. తగినంత ఇసుకను అందించి భవన నిర్మాణ కార్మికుల ఉపాధికి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని రమేష్ కోరారు.

పంట పొలాల్లో అడవి పందుల విధ్వంసం



పొలాల్లో తిరుగుతున్న అడవి పంది

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో పొలాలపై అడవి పందులు మూకుమ్మడిగా విధ్వంసం చేస్తున్నాయి. ఆ సమయంలో అడ్డు వచ్చిన రైతులపై కూడా దాడులకు దిగుతున్నాయి. ఇప్పటి వరకు తెగుళ్లతో రైతులు పోరాడి అలిసిపోయారు. మళ్లీ అడవి పందులు పంటలపై దాడులు చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. పశ్చిమ ప్రకాశంలో పంటలపై అడవి పందుల దాడితో రైతులు పంటలను కాపాడుకునేందుకు రాత్రి పూట పొలాల్లోనే నిద్రపోతున్నారు. కంటి మీద నిద్ర లేకుండా పంటలు కాపాడుకుంటున్నారు. వర్షాభావంతో పంటలు ఎండిపోతున్న దశలో పైపులు వేసుకుని పంటలను కాపాడుకునేందుకు రైతులు ఓ వైపు శ్రమిస్తుండగా మరో వైపు చేతికి వచ్చే పంటను అడవి పందులు రాత్రి పూట గుంపులుగా పొలాలపై దాడి చేసి నాశనం చేస్తున్నాయి. పందుల బారి నుంచి కాపాడుకునేందుకు టపాసులు కాల్చుతున్నారు. మార్కాపురం సబ్ డివిజన్‌లో పత్తి, మిర్చి, కంది, వరి సాగు చేశారు. గిద్దలూరు నుంచి పుల్లలచెరువు వరకు ఉన్న గ్రామాల్లో పంటలపై అడవి పందులు దాడి చేస్తున్నాయి. పత్తి, కంది, మిర్చి పైర్లను తొక్కేస్తున్నాయి. దీంతో అడవి పందుల దాడితో రైతులు నష్టపోతున్నారు. రైతులపై దాడులు చేస్తున్నాయి. ఇటీవల పెద్దదోర్నాల మండలం కొత్తూరులో ఈ నెల 12న పశుగ్రాసం కొసం వెళ్లిన రైతు యరామిరెడ్డిపై అడవిపంది దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మార్కాపురం మండలం నాగులవరం, వేములకోట, బోడపాడు, దరిమడుగు, ఇడుపూరు, గొట్టిపడియ, జమ్మనపల్లి, ఎల్‌బీఎస్‌నగర్, నికరంపల్లి, కోలభీమునిపాడు, పెద్దారవీడు మండలం కలనూతల, పుచ్చకాయలపల్లె, సుంకేసుల, గుండంచర్ల, బద్వీడు చెర్లోపల్లె, కొత్తపల్లె, దోర్నాల మండలం బొమ్మలాపురం, గంటవానిపల్లె, కొత్తూరు, యడవల్లి, గంటవానిపల్లె, నల్లగుంట్ల, యర్రగొండపాలెం మండలం కొత్తూరు, గంజివారిపల్లె, పందివానిపల్లె, అమానిగుడిపాడు, బోయలపల్లి, గుర్రపుసాల, కొలుకుల, పుల్లలచెరువు మండలం వెంకటరెడ్డిపల్లె, ముటుకుల, మర్రివేముల, శతకోడు, తర్లుపాడు మండలం నాయుడుపల్లె, శీతానాగులవరం, తాడివారిపల్లె, నాగెళ్లముడుపు, మీర్జాపేట, సూరేపల్లె, అర్ధవీడు మండలం గన్నేపల్లి, కాకర్ల, రంగాపురం, యాచవరం, వెలగలపాయ, పాపినేనిపల్లె, దొనకొండ, బేస్తవారిపేట మండలం పందిళ్లపల్లి, గలిజేరుగుళ్ల, పెద్దఓబినేనిపల్లె పూసలపాడు, రాచర్ల మండలం పలుగుంటిపల్లె, అనుములపల్లె, జె.పుల్లలచెరువు తదితర గ్రామాల్లో అడవి పందుల బెడద ఎక్కువగా ఉంది. పంటలను కాపాడుకునేందుకు రైతులు పొలాల్లోనే మంచె కట్టుకుని తెల్లవార్లూ జాగారం చేస్తూ పంటలను కాపాడుకుంటున్నారు. విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకుందామనుకుంటే రాత్రి పూట తామే నీరు కట్టుకునేందుకు తిరుగుతుంటామని, దీంతో ఏం చేయాలో అర్థం కావటం లేదని వేములకోట గ్రామానికి చెందిన రైతులు జానపాటి ఆవులయ్య, టి.రామిరెడ్డిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకతి వైపరీత్యాలు జరిగి పంట నష్టపోతే ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని, అడవి పందుల దాడితో ఎలాంటి పరిహారం ఇవ్వటం లేదని తెలిపారు. అటవీశాఖ, వ్యవసాయ శాఖాధికారులు అడవి పందుల నివారణకు తమకు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి ఆరుకాలం కష్టించి పంటలు పండిస్తే అడవి పందుల నోట్లో పడి దిగుబడులు రాకుండా పోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు వర్షాలు పడక పంటలు ఎండిపోతుండగా మరో వైపు ఉన్న పంటలను అడవి పందులు నాశనం చేయడంతో రైతులు నిరాశ, నిస్పృహలతో ఉన్నారు.

నైతికతే నిజమైన స్వేచ్ఛ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మహిళా నేతలు

మార్కాపురం:

నైతికతే నిజమైన స్వేచ్ఛ అని జమాతే ఇస్లామీ హింద్ జిల్లా కార్యదర్శి తబస్సుమ్ అన్నారు. జేఐహెచ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదంతో వాల్‌పోస్టర్లు, పాంప్లేట్స్‌ను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో మితి మీరిన స్వేచ్ఛ పేరుతో చోటుచేసుకుంటున్న పరిణామాలు, మహిళలపై చెడు ప్రభావం చూపుతున్నాయన్నారు. నిజమైన స్వేచ్ఛ కేవలం నైతికత తోనే సాధ్యమనే వాస్తవాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఒక సర్వే ప్రకారం దేశంలో రోజూ 90 అత్యాచార కేసులు నమోదు కావడం ఆందోళన కలిగించే విషయమన్నారు. నైతికతపై కళాశాల స్థాయిలో వ్యాసరచన, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు సాహేదా, సుమయ, అమీనా, ఆసీఫా, ఆయేషా పాల్గొన్నారు.

గణనాథునికి అన్నా ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అన్నా రాంబాబు



అన్న వితరణ ప్రారంభిస్తున్న అన్నా రాంబాబు



నిమజ్జనం సందర్భంగా మహిళల సందడి

మార్కాపురం టౌన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని బొగ్గరపు వారి వీధిలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమం ఆయన ప్రారంభించారు. పీఎస్ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని కోనేటి వీధిలో గణనాథుడిని సోమవారం ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనానికి తరలించారు. భక్తుల కోలాహలం, సందడి మధ్య గణేష్ నిమజ్జనం వైభవంగా జరిగింది. సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి విఘ్నేశ్వరుడి ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఉత్సాహంతో పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో అంత్యక్రియలకు సాయం



చెక్కు అందజేస్తున్న సభ్యులు

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని నవాబ్‌మిట్టలో షేక్ ఖాదర్‌బీ అనారోగ్యంతో మృతి చెందింది. పేద కుటుంబం కావడంతో అంత్యక్రియల కోసం మానవత సేవా సంస్థ రూ.5 వేల సాయం అందజేశారు. ఈ మేరకు సోమవారం మృతురాలి భర్తకు రూ.5 వేల చెక్కు అందజేశారు. జిల్లా కన్వీనర్ కె.యల్లమందారెడ్డి, మండల కన్వీనర్ కల్లం వెంకట సుబ్బారెడ్డి, డైరెక్టర్ యక్కలి శేషగిరిరావు, కార్యదర్శి అశోక్ బండి, సంయుక్త కార్యదర్శి భూమా సుమంత్, శాంతి కమిటీ సభ్యులు ఎద్దు నగేష్, మీడియా ప్రతినిధి షేక్ బాజీ కరీముల్లా, సభ్యులు షేక్ యాసిన్, షేక్ షాహిద్, షేక్.మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

స్విమ్మర్ శ్రీనివాస్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న భాస్కర్ దంపతులు

పొదిలి: మండలానికి చెందిన గోపనబోయిన శ్రీనివాస్ ఇటీవల నేపాల్లో జరిగిన అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాధవి దంపతులు శ్రీనివాస్‌ను సన్మానించారు. భాస్కర్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్‌ను శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. వాసవి క్లబ్ నాయకులు సోమిశెట్టి శ్రీదేవి, సోమిశెట్టి చిరంజీవి, సామిరాజా, మాజీ ఉప సర్పంచ్ షేక్ జిలానీ, షేక్ కమర్, షేక్ సలీం, మండల ఎస్సీ సెల్ నాయకులు ఎద్దు నగేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అడ్డంకి కలిగిస్తే కఠిన చర్యలు



సూచనలిస్తున్న సీఐ సుబ్బారావు, సిబ్బంది

మార్కాపురం: పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. పట్టణంలోని నెహ్రూ బజారు, స్టూడియో బజారు, మార్కెట్ సెంటరు, మున్సిపాలిటీ ఏరియా తదితర ప్రాంతాల్లో రోజూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. వివిధ షాపుల వద్ద రోడ్లపై అడ్డంగా పెట్టిన వాహనదారులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. పలు హోటళ్లు, టీ షాపులు, మెడికల్ షాపులు, కిరాణా షాపుల వద్ద పార్కింగ్ లేకున్నా వాహనాలను నిలిపి తమ వ్యక్తిగత పనులపై వెళ్లిన వాహనాదారులను పిలిపించి మాట్లాడారు. షాపుల ముందు ఎవరూ వాహనాలు పెట్టడానికి వీల్లేదని హెచ్చరించారు. ఆయన వెంట పట్టణ ఎస్సై సైదుబాబు ఉన్నారు.

మార్కాపురం విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు



మోహన్‌పూర్ణ (ఫైల్)

మార్కాపురం: మండలంలోని వేములకోట గ్రామానికి చెందిన గుంజే మోహన్ పూర్ణ కౌన్సిలింగ్‌లో ఎంబీబీఎస్‌లో ఉచిత మెడికల్ సీటు సాధించారని జ్ఞానశ్రీ నీట్ అకాడమీ డైరెక్టర్ ఎం.మల్లికార్జునరావు తెలిపారు. అమలాపురంలోని కోనసీమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ కళాశాలలో సీటు దక్కినట్లు చెప్పారు. తండ్రి రాములు వ్యవసాయ కూలీ. ఉచిత మెడికల్ సీటు రావడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. మోహన్‌పూర్ణను పలువురు అభినందించారు.

పేద ముస్లింలకు స్వీట్ల పంపిణీ



స్వీట్లు అందిస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్సై సైదుబాబు

మార్కాపురం: మిలాద్ నబీ పండగను పురస్కరించుకుని పట్టణ సీఐ పి. సుబ్బారావు పేద ముస్లిం విద్యార్థులకు సోమవారం స్వీట్లు అందించారు. పలువురు ముస్లింలకు, వృద్ధులకు మసీదు వద్దకు వెళ్లి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ మిలాద్ నబీ పండగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈయన వెంట పట్టణ ఎస్సై సైదుబాబు, సిబ్బంది ఉన్నారు.

సీపీఎం నేత ఏచూరికి ఘన నివాళి



సీతారామ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం టౌన్: సీపీఎం నేత సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సీపీఎం నేత ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి సీతారాం అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేసుకున్నారని, నేటితరం యువతకు విలువలతో కూడిన త్యాగం చూపారన్నారు. ఆయన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేశారన్నారు. మతోన్మాద కార్మిక వ్యతిరేక విధానాలు వ్యతిరేకిస్తూ ముందుండి నడపడమే ఏచూరికి ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు సుబ్బరాయుడు, జి.హరి, సలాంఖాన్, ఇమామ్‌సా, చెన్నకేశవులు, అల్లూరయ్య, రషీద్, గురునాథం పాల్గొన్నారు.

రైలు కిందపడి మృతి చెందిన వ్యక్తిది బేస్తవారిపేట

కంభం: కంభం–జేబీకే పురం మధ్యలో శనివారం రాత్రి రైలుకింద పడి మృతి చెందిన వ్యక్తి బేస్తవారిపేట అంబేద్కర్ కాలనీకి చెందిన ఆర్లగడ్డ అల్లూరయ్య గా గుర్తించినట్లు మార్కాపురం రైల్వే ఏఎస్సై ఎ. వెంకట్రావు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వికలాంగుడని, అనారోగ్యంతో బాధపడుతున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదని, సోషల్ మీడియా, పేపర్లలో చూసి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తుపట్టారన్నారు. కంభం ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేసిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తాడివారిపల్లిలో క్రైస్తవుల శిలువ ప్రతిష్ఠ



శిలువ ప్రతిష్ఠలో పాల్గొన్న క్రైస్తవులు

తర్లుపాడు: మండలంలోని తాడివారిపల్లిలో ఆంధ్ర ఇవలాంజికల్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో సోమవారం క్రైస్తవులు శిలువ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రవి ఆధ్వర్యంలో కొండపై శిలువను ఏర్పాటు చేశారు. క్రైస్తవ గీతాలను ఆలపించారు. బైబిల్ బోధనలు చదివి వినిపించారు. మానవాళిని పాపాల నుంచి విముక్తం చేయడం కోసం ఏసుక్రీస్తు శిలువ ఎత్తారని పాస్టర్లు వివరించారు. అనంతరం కొండపై భోజనాలు చేశారు. పాస్టర్లు మధు, ఎస్సయ్య, సుబ్బారావు, శ్యామ్ సుందర్ పాల్గొన్నారు. దారా డేవిడ్, దేవదాసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సర్పంచ్ జాన్ రత్నంతో పాటు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభువుని స్తుతించారు.

సొంత నిధులతో చిల్లకంప తొలగింపు



చిల్లచెట్లు తొలగిస్తున్న జేసీబీ

తర్లుపాడు:

మండలంలోని లక్ష్మక్కపల్లి ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం జగన్‌బాబు సొంత నిధులతో గ్రామంలోని రహదారికి ఇరువైపులా ఉన్న చిల్లకంపను తొలగించారు. కొద్దిరోజులుగా రహదారి వెంట ప్రయాణించే పలువురు చిల్లకంపతో రోడ్డు సరిగా కనపడక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. విషయాన్ని గుర్తించిన హెచ్‌ఎం జగన్‌బాబు చిల్లకంపను తొలగించినట్లు వివరించారు. హెచ్‌ఎం సేవాభావాన్ని గ్రామస్తులు కొనియాడారు.

18 నుంచి కంభంలో మండల స్థాయి ఆటల పోటీలు

కంభం: కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 విభాగంలో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగా, బ్యాడ్మింటన్ పోటీలు మండల స్థాయిలో జరుగుతాయని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. 2011 జనవరి 01వ తేదీ తర్వాత జన్మించిన వారు అండర్ 14 విభాగంలో, 2008 జనవరి 01 తర్వాత జన్మించిన వారు అండర్ 17 విభాగంలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వయస్సు ధ్రువీకరణ పత్రం , ఇతర నిర్ధారణ పత్రాలతో హాజరుకావాలన్నారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలతో సహా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవా

మార్కాపురం టౌన్: ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి వార్డులో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు సూచనలు ఇస్తున్న సీఐ

గిద్దలూరు రూరల్: పట్టణంలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ కె.సురేష్ అన్నారు. స్థానిక క్లబ్‌రోడ్డులో రోడ్డు మార్జిన్ పక్కన ఉన్న వాహనాలను తొలగించే చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనదారులు పోలీసు సూచనలు పాటించాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



మొక్కలను నాటుతున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్ ఆవరణలో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్‌నారాయణరెడ్డి, ముస్లిం నాయకులు యాకూబ్ ఖాన్, హబీబ్‌ఖాన్, రసూల్, షేక్.మదార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక పారిశుధ్య పనులు

● దర్శి నగర పంచాయతీ కమిషనర్

దర్శి: కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అనుసరించి స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత లక్ష్యంగా దర్శి నగర పంచాయతీలో 15 రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ జరుగుతందని మున్సిపల్ కమిషనర్ మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్యంపై ప్రజలను భాగస్వామ్యం చేయటం, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పార్కులు శుభ్రపరచుట, ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రపరచుట, పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ చెకప్ చేయించడం, కార్మికులకు వారికి సంబంధించిన ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాపార, వర్తక సంఘాల వారు, స్వయం సహాయక సభ్యులు, సచివాలయ సిబ్బంది, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు మరియు కో ఆప్షన్ సభ్యులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.